నేడు కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుక

మహబూబాబాద్, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించే బతుకమ్మ వేడుకలో మహిళా అధికారులు, ఉద్యోగినులు పాల్గొనాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు, ఆడ పిల్లల సంరక్షణ కోసం ఈ నెల 10న ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి విలేజ్ హెల్త్ న్యూట్రిషన్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆర్డీవో అలివేలు, జడ్పీ సీఈవో నర్మద, జిల్లా సంక్షేమ శాఖాధికారి వరలక్ష్మి, డీఆర్‌డీవో మధుసూధన్‌రాజు పురపాలక కమిషనర్ నోముల రవీందర్, బీసీ సంక్షేమ శాఖాధికారి నరసింహస్వామి, డీపీవో హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన


ఎన్టీఆర్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్


మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల నిర్వహణలో మహిళలు, ప్రజలకు సౌకర్యాల అందేలా తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సద్దుల బతుకమ్మ నిర్వహణకు ఎన్టీఆర్ మైదానం, దసరా వేడుకలకు హనుమంతునిగూడెంలోని బందెలదొడ్డి ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఎన్టీఆర్ మైదానంలో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కమిషనర్ నోముల రవీందర్, పురపాలక సంఘం ఉపాధ్యక్షుడు మార్నేని వెంకన్న, భారాస, సీపీఎం ఫ్లోర్‌లీడర్లు చిట్యాల జనార్దన్, సూర్నపు సోమయ్య, డీఈ చిప్ప ఉపేందర్ పాల్గొన్నారు.

గురుతర బాధ్యత మీదే..!

నేడు డీఎస్సీ విజేతలకు నియామక పత్రాలు

జిల్లాలవారీగా భర్తీ కానున్న పోస్టులు

జిల్లా	స్కూల్‌అసిస్టెంట్లు	ఎస్‌జీటీ	భాషాపండితులు	పీఈటీ	స్పెషల్ ఎడ్యుకేటర్ (ఎస్‌ఏ)	స్పెషల్ ఎడ్యుకేటర్(ఎస్‌జీటీ)	మొత్తం
హనుమకొండ	73	81	5	7	4	17	187
జనగామ	50	118	21	7	5	20	221
భూపాలపల్లి	41	152	20	7	4	13	237
మహబూబాబాద్	71	264	19	2	5	20	381
ములుగు	33	125	16	1	3	14	192
వరంగల్	66	182	21	6	5	21	301




ఉపాధ్యాయుల్లేక.. బోధన సరిగా జరగక.. గాడితప్పిన పాఠశాలలకు ఇకపై మంచి రోజులు రానున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తుండటంతో బడులకు పూర్వ వైభవం వస్తుందని ఆశిస్తున్నారు. ఈ దిశగా కొత్త గురువులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలి.. విద్యార్థుల సంఖ్య తగ్గి ఆదరణ కోల్పోతున్న తరుణంలో.. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచేలా కృషి చేయాలి. పేద పిల్లల్లో జ్ఞాన జ్యోతులు వెలిగించి భవిష్యత్తుకు బాటలు వేయాలి. నేడు సీఎం చేతులమీదుగా నియామక పత్రాలు అందుకోనున్న నేపథ్యంలో బడుల్లో వారి పాత్ర ఎలా ఉండాలో వివరిస్తూ 'ఈనాడు' ప్రత్యేక కథనం..

ఈనాడు, మహబూబాబాద్-న్యూస్‌టుడే, భూపాలపల్లి


హనుమకొండ డీఈవో కార్యాలయంలో డీఎస్సీ విజేతలు

ఆదర్శంగా నిలవాలి ఇలా..

సొంతంగా ఖర్చుచేస్తూ..



ఈ ఉపాధ్యాయుడు రేగూరి సుభాకర్‌రెడ్డి.. భూపాలపల్లి మండలం గొర్లవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సొంతంగా ఖర్చు చేసి విద్యార్థులకు షూ, టై, బెల్ట్‌తో పాటు ప్రత్యేకంగా ఐడీ కార్డులు తయారు చేయించారు. 14 మంది విద్యార్థులు ఉపకార వేతన పోటీ పరీక్ష రాయగా సొంతంగా ఫీజు చెల్లించారు. విద్యార్థిని అక్షిత ట్రిపుల్ ఐటీలో సీటు సాధిస్తే.. రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు.

విద్యార్థుల సంఖ్య పెంచి..



భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలంలోని బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు రాచర్ల శ్రీనివాస్ విద్యార్థుల సంఖ్య 20 నుంచి 40కి పెరిగేలా కృషి చేశారు. సొంతంగా ఖర్చు చేసి స్కూల్ బ్యాగులు, షూ, నిఘంటువులను అందించారు.

సౌర వెలుగులు అందించి..



భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం యామన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఐత తిరుపతి 14 అటవీ గ్రామాల పాఠశాలల విద్యార్థులకు సుమారు వెయ్యి మందికి రెడ్కో సంస్థ ఆధ్వర్యంలో సోలార్ ల్యాంపులు పంపిణీ చేశారు. రాత్రి వేళ చదువుకునేలా విద్యా వెలుగులు అందించారు. అమెరికాలోని మిత్రుడి సాయంతో విద్యా సామగ్రి, 77 మంది పిల్లలకు క్రీడా పరికరాలు పంపిణీ చేశారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

ప్రాథమిక పాఠశాలలు కొత్తగా రానున్న సార్లతో కళకళలాడనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల పదోన్నతులతో ఖాళీ అయిన స్థానాలన్నీ కొత్త గురువులతో భర్తీ కానున్నాయి. 922 మంది ఎస్‌జీటీలు విధుల్లో చేరిన తొలిరోజు నుంచే బడిబాగుకు పాటుపడాలి. విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలి.

భాషలో రాణించేలా..

తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలు అంటే విద్యార్థులు భయపడు తున్నారు. విధుల్లో చేరబోతున్న 102 మంది భాషా పండితులు ప్రత్యేక చొరవ చూపాలి. ఆటపాటలు, కథలు, నుడికారాలు, సామెతలు, వంటి వాటితో భాషపై ఆసక్తి పెంచాలి.

క్రీడల్లో వెలుగొందాలి

వ్యాయామ ఉపాధ్యాయుల భర్తీ చేపట్టడం శుభపరిణామం. ఉమ్మడి జిల్లాలో 30 మంది విధుల్లో చేరనున్నారు. ఇకపై మైదానాలు కళకళలాడాలి.. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా సిద్ధం చేయాలి.

'సబ్జెక్టు'పై పట్టు సాధించేలా..

ఉమ్మడి జిల్లాలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఇటీవల పదోన్నతుల ద్వారా సబ్జెక్టు ఉపాధ్యాయులు వచ్చినా ఇంకా కొరత నెలకొంది.. ఇకపై ఆ సమస్య ఉండదు. కొలువుదీరనున్న 334 మంది స్కూల్ అసిస్టెంట్లు ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులకు ప్రతి పాఠ్యాంశాన్ని మూలాల్లోకి వెళ్లి బోధించాలి. కృత్యాధార, ప్రయోగాత్మకమైన బోధన చేయాలి.

ప్రత్యేక 'బోధన'కు పెద్దపీట

ఉమ్మడి జిల్లాలో ఎంతో కాలంగా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు బోధకుల్లేక అవస్థలు పడ్డారు. ఇకపై వారికి మంచి రోజులే.. వారి కోసమే 26 మంది స్కూల్ అసిస్టెంట్లు, 105 మంది ఎస్‌జీటీలు విధుల్లో చేరనున్నారు. 'ప్రత్యేక' అవసరాలను గుర్తించి వారిలో మానసిక వికాసాభివృద్ధి జరిగేలా దోహదపడాలి.

నాలా.. ఆక్రమణలేలా..!


ఇల్లందు రోడ్‌లో జ్యోతిబాపులే కూడలి సమీపంలో

మహబూబాబాద్, న్యూస్‌టుడే: భారీ వర్షాలు కురిస్తే మహబూబాబాద్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నీటి ముంపునకు గురవుతున్నాయి. ప్రధానంగా నాలాల ఆక్రమణలతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు ముందుకు ప్రవహించే దారి లేక ఆ సమీపంలోని ప్రాంతాల్లో నీరు నిలిచిపోతుంది. గత నెల కురిసిన వర్షాలతో దశబ్దాల కాలంగా ఎదురుకాని నీటి ముంపు ప్రమాదాలను పట్టణవాసులు ఎదుర్కొన్నారు. నాలాలు ఆక్రమణకు గురవుతున్నా ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకుల ఒత్తిళ్ల వల్ల అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సివస్తోంది.

టాస్క్‌ఫోర్స్

నిధుల రద్దుతో ఆగిన వరద కాలవ నిర్మాణాలు

వరద నీరు సాఫీగా ముందుకు ప్రవహించేందుకు గత ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ ద్వారా రూ. 50 కోట్లు మంజూరు చేసింది. అందులో రూ. ఐదు కోట్ల నిధులు ఆరు వరద కాలవల నిర్మాణాలకు ప్రతిపాదనలు చేశారు. సకాలంలో పనులు ప్రారంభించకపోవడం వల్ల కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ఆ నిధులను రద్దు చేసింది. నిధులను రద్దు చేయకుంటే ఈ నిర్మాణాలు కొనసాగేవి.

నిర్మాణాలతో మూసుకుపోయిన దారి

మహబూబాబాద్-ఇల్లందు ప్రధాన రహదారిలో జ్యోతిబాపులే కూడలి సమీపంలో బంధం చెరువు నుంచి జానాల చెరువుకు వెళ్లే పాసివాగు దాటేందుకు ఏడు దారులు(వెంట్స్) నిర్మించారు. కొన్నేళ్లుగా ఈ కాలువ పక్కనే నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో బంధం చెరువు నుంచి వరద ఉద్ధృతంగా వచ్చి ఈ ప్రాంతం నీట మునిగి రాకపోకలు నిలిచిపోయాయి. వరదలకు ముందే 2024 జూన్ నెలలో నీటి పారుదల శాఖాధికారులు ఈ వాగుపై నిర్మించిన కల్వర్టు కింద ఏడు దారులకు మూడు మాత్రమే కనిపిస్తున్నాయని మిగిలిన నాలుగు మూతపడేలా నిర్మాణాలు జరుగుతున్నాయని పురపాలక అధికారులకు లేఖ రాశారు.

నీరు ముందుకు ప్రవహించేదెలా..


మూడుకొట్ల సెంటర్ - ఈదులపూసపల్లి రోడ్‌లో

శ్రీరాంభద్రయ్య కాలనీ, మిల్ట్రీకాలనీ, ఎన్జీవోస్ కాలనీల నుంచి వచ్చే వరద మూడుకొట్ల కూడలి నుంచి ఈదులపూసపల్లి వెళ్లే ప్రధాన రోడ్ దాటి కేంద్రీయ విద్యాలయం మీదుగా సిగ్నల్ కాలనీవైపు ప్రవహించాలి. ఈదులపూసపల్లి వైపు వెళ్లే మార్గం వరకే ఈ కాలువద్వారా నీరు వచ్చి ముందుకు వెళ్లేదారి లేక రోడ్డుపైకి ప్రవహిస్తున్నాయి. ఎదురుగా ఉన్న కాలువను మూసివేయడంతో ఇటీవల కురిసిన వర్షాలతో ఈ ప్రాంతంలోని రహదారిపై నీరు ప్రవహించి ఇళ్లలోకి చేరుకున్నాయి. నాలా కొనసాగింపు లేకపోవడం వల్లే నీరు ముందుకు వెళ్లడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

☛ నాలాలో అక్రమ నిర్మాణాలను నిలిపివేస్తున్నట్లు మానుకోట పురపాలక సంఘ కమిషనర్ నోముల రవీందర్ స్పష్టం చేశారు. రెవెన్యూ, నీటి పారుదల శాఖాధికారులతో కలిసి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పాసివాగులో నిర్మాణ పనులను నిలిపివేశామన్నారు. ఎక్కడైన ఫిర్యాదులు వస్తే ఆయా శాఖల అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామన్నారు.


సిరులతల్లి.. కల్పవల్లి!

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు లక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. డోర్నకల్ జైన్ భవన్‌లోని అమ్మవారితో పాటు డోర్నకల్ ముత్యాలమ్మతల్లి గుడిలో దుర్గామాతాని కరెన్సీ నోట్లతో అలంకరించారు. మరిపెడ మండలం గుండెపుడి గ్రామంలో రూ.7,07,116 కరెన్సీ నోట్లతో, దంతాలపల్లిలో రూ.3.90 లక్షలు, దాట్లలో రూ.6 లక్షల నోట్లతో అలంకరించారు. బయ్యారం, గార్లలో శ్రీమహాలక్ష్మి అవతారంలో మంగళవారం భక్తుల పూజలందుకున్నారు. -న్యూస్‌టుడే, బృందం


గార్లలో


బయ్యారంలో


డోర్నకల్ జైన్‌భవన్‌లో


దంతాలపల్లిలో


ముత్యాలమ్మతల్లి గుడిలో


కొమ్ములవంచలో


గుండెపుడిలో

మార్కెట్‌కు నాలుగురోజులు సెలవు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి షంషీద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న దుర్గాష్టమి, 11న మహార్నవమి,12న విజయదశమి, 13న ఆదివారం సందర్భంగా నాలుగు రోజులు సెలవులు ప్రటించినట్లు పేర్కొన్నారు. 14వ తేదీ సోమవారం నుంచి మార్కెట్‌లో క్రయ విక్రయాలు కొనసాగుతాయన్నారు.

కూడళ్లు కిటకిట..!



బతుకమ్మ.. దసరా పండగల సమయం.. రైలు ప్రయాణికులు..వివిధ ప్రాంతాలకు బస్సుల్లో వెళ్లేందుకు ఉరుకులు పరుగులు తీసేవారు.. ఆటోలు.. ఇతర వాహనాల్లో వెళ్లేవారితో మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌కు ఇరువైపులా ఉన్న మదర్ థెరిసా, నెహ్రూ కూడళ్లలో ప్రజల రద్దీ నెలకొంది. మంగళవారం పాదచారులు అడుగు ముందుకు వేయలేనంత రద్దీగా ఉంది.

– న్యూస్‌టుడే, మానుకోట

ఉద్యోగ అవకాశాలు పొంది ఉన్నతంగా జీవించాలి


ప్రసంగిస్తున్న జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతీ, యువకులు తమకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొంది ఉన్నతంగా జీవించాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రూమింగ్ ఎక్స్‌లెన్స్ సంస్థ సహకారంతో మంగళవారం జిల్లా కేంద్రంలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... నిరుద్యోగులు కష్టపడి ఉద్యోగం పొందేలా సాధన చేయాలన్నారు. ప్రైవేట్ రంగంలోనూ ఉద్యోగాలు పొంది పలువురు ఆర్థికంగా స్థిరపడినవారున్నారని పేర్కొన్నారు. కుటుంబంలో ఒకరు ఉద్యోగం చేస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందుతురాని, దీంతో గ్రామం, మండలం, జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. యువత గంజాయి, గుడుంబా వంటి వాటికి దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో 50 ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొనగా 2,500 మంది నిరుద్యోగులు హాజరయ్యారు వీరిలో 375 మందికి ఉద్యోగ అవకాశం కల్పించారు. 612 మందికి ముఖాముఖికి అవకాశం కల్పించినట్లు ఎస్పీ తెలిపారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులకు ఎస్పీ నియామక పత్రాలను అందజేశారు అదనపు ఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీలు తిరుపతిరావు, శ్రీనివాస్, పట్టణ రూరల్ సీఐలు దేవేందర్, సర్వయ్య, ఎస్సైలు,సిబ్బంది, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


ఉద్యోగ మేళాకు హాజరైన అభ్యర్థులు

రైతులకు రుణమాఫీ చేయాలి

కురవి, న్యూస్‌టుడే: రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కురవి సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్న హామీని పూర్తిగా అమలు చేయడం లేదన్నారు. దీంతో పాటు రైతు బంధు కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. 50 శాతం మంది రైతులు పంటల పెట్టుబడులకు సొమ్ము లేక అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. మండల కార్యదర్శి రాజన్న, ఉప్పలయ్య, నాగరాజు, రమేశ్ ఉన్నారు.

కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం వత్తాసు



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి. నాగయ్య

కురవి, న్యూస్‌టుడే: ప్రజాసంక్షేమాన్ని విస్మరిస్తూ కార్పొరేట్, పెట్టుబడిదారుల శక్తులకు కేంద్ర ప్రభుత్వం దోచిపెడుతుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి. నాగయ్య అన్నారు. కురవి మండలం నేరడలో సీపీఎం గ్రామ శాఖ మహాసభ మంగళవారం జరిగింది. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా పేదలకు అందించాల్సిన రాయితీలు, సంక్షేమాలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ ప్రజలను మోసం చేస్తుందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ సామాన్యులపై భారాలు మోపుతుందన్నారు. మహాసభలో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, ఆకుల రాజు, కోటయ్య, సుధాకర్, తిరుపతి, మల్లయ్య, సత్యం, వెంకన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు విస్తృత ప్రచారం

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్ల నమోదుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్ నుంచి జిల్లా అధికారులతో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై దూరదృశ్య సమావేశం నిర్వహించగా మానుకోట నుంచి కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పో, డేవిడ్, ఆర్డీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాల్ చేస్తారు.. కొల్లగొడతారు!



- కమిషనరేట్‌లో ఈ ఏడాది 41 కేసులు

ఈనాడు, వరంగల్, న్యూస్‌టుడే, వరంగల్ క్రైం

కొత్త దారులు వెతుకుతూ..

సైబర్ మోసగాళ్లు ఎప్పటికప్పుడు నేరాలకు పాల్పడేందుకు కొత్త దారులు వెతుకుతూ ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. గతంలో చరవాణులకు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా లింక్‌లు పంపించి, మల్టీలెవల్ మార్కెటింగ్, ఓటీపీ సంఖ్యలు తెలుసుకొని లేదా డెబిట్, క్రెడిట్ కార్డులు, బహుమతులు వచ్చాయని, తక్కువ ధరకు వస్తువులు విక్రయిస్తామని మోసాలకు పాల్పడేవారు. తాజాగా సైబర్ నేరగాళ్లు సీబీఐ, ఈడీ, పోలీసు, ఏసీబీ అధికారుల పేరు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు.

పిల్లల పేరు చెప్పి..

పిల్లలు ఇతర దేశాల్లో లేదా ఇతర రాష్ట్రాల్లో చదువుతుంటే వారిపై డ్రగ్స్ లాంటి కేసులు నమోదయ్యాయని, ప్రస్తుతం తమ అదుపులో ఉన్నాడని, తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తాము చెప్పిన ఖాతాలకు డబ్బులు పంపిస్తే వెంటనే విడుదల చేస్తామని. లేదంటే అరెస్టు తప్పదనేసరికి తల్లిదండ్రులు ఆందోళన చెంది డబ్బులు నష్టపోతున్నారు.

సమాచారం ఇలా సేకరిస్తారు

సైబర్ నేరగాళ్లు మన ఫోన్ నెంబర్, ఇతర వ్యక్తిగత వివరాలు సేకరించేందుకు అనేక రకాలుగా సాంకేతికతను వినియోగిస్తున్నారు. పలు బ్యాంక్‌లు, వివిధ సంస్థలు, మాల్స్ నుంచి ఖాతాదారులకు సంబంధించిన డేటా సేకరిస్తున్నారు. లేదా మహిళలతో కొన్ని నెంబర్లకు ఫోన్ చేయించి వివరాలు తెలుసుకొని కొద్దిరోజుల తర్వాత సైబర్ నేరాలు చేసేందుకు వాడుతున్నారు.

'హలో మేం సీబీఐ నుంచి మాట్లాడుతున్నాం'.. అంటూ వీడియో కాల్ వస్తుంది. అందులో సీబీఐ కార్యాలయం, బోర్డులు కనిపిస్తాయి. మాట్లాడేవారు ఖాకీ దుస్తుల్లో ఉంటారు.. మీ అబ్బాయిని అరెస్టు చేశామనో, లేదా మీరు హవాలా మార్గంలో పెట్టుబడి పెట్టినందుకు కేసు నమోదు చేసి.. డిజిటల్ అరెస్టు చేస్తున్నామని మొదట బెదిరిస్తారు. ఆ తర్వాత కేసు నుంచి బయటపడాలంటే అడిగినంత ఇవ్వాలంటూ రూ.లక్షల్లో డిమాండు చేస్తారు. ఇటీవల ఉమ్మడి వరంగల్‌లో అనేక మందికి ఇలా వీడియో కాల్స్ వచ్చాయి. సీబీఐ, ఈడీ, ఏసీబీ.. ఇలా అనేక రకాల పేర్లతో సామాన్యులకు వీడియోకాల్ చేసి బెదిరిస్తూ రూ. వేలు, లక్షల్లో వసూలు చేస్తున్నారు.

నేరుగా కేసులుండవు

కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలు నేరుగా కేసులు నమోదు చేయవు.. న్యాయస్థానాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వారు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తారు. సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితులుగా ఎవరైనా ఉన్నా వాట్సాప్, వీడియో కాల్స్ చేయరు. చట్ట ప్రకారం నిందితులకు నోటీసు పంపిస్తారు. ఇలాంటి పేర్లతో కాల్స్ వస్తే ఆందోళన చెందకుండా వెంటనే సైబర్ విభాగానికి ఫిర్యాదు చేయాలి.

అప్రమత్తత అవసరం

- సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి. నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతుంటారు. వ్యక్తిగత సమాచారం, ఆధార్, పాన్ కార్డు నంబర్లు చెప్పవద్దు.. ఏదైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.



సైబర్ నేరాలపై వరంగల్ కమిషనరేట్ సైబర్ విభాగం వారు ఇటీవల నిర్వహించిన అవగాహన సదస్సు

మన దగ్గర అనేక ఘటనలు

- గత నెలలో జనగామ జిల్లాలో పని చేస్తున్న పలువురు ప్రభుత్వ అధికారులకు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఏసీబీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. ఆదాయానికి మించి అస్తులున్నాయని, మీరు లంచం తీసుకున్నారని, బెదిరింపులకు పాల్పడుతూ మోసాలు చేసేందుకు ప్రయత్నించారు. కొంతమంది వీరికి చిక్కి డబ్బులు పోగొట్టుకున్నారు. మరికొందరు పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు పెట్టారు.
- మూడు రోజుల క్రితం హనుమకొండకు చెందిన పారిశ్రామిక వేత్తకు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి సీబీఐ అధికారులమంటూ రూ.28.50 లక్షలు కాజేశారు.
- హనుమకొండ టీచర్స్ కాలనీకి చెందిన ఓ మహిళకు ఇటీవల ఒక వీడియోకాల్ వచ్చింది. ఆమె ఫోన్ ఎత్తగానే 'హలో మేం సీబీఐ ముంబయి నుంచి మాట్లాడుతున్నామని, మీ అబ్బాయిని మరో నలుగురితో కలిసి అరెస్టు చేశాం' అని చెప్పారు. ఆమె ఒక్కసారిగా కంగుతిన్నా తర్వాత తేరుకున్నారు. అబ్బాయి హైదరాబాద్‌లో హాస్టల్ ఉంటే ముంబయిలో ఎలా అరెస్టు చేస్తారని రాంగ్ కాల్ అని పెట్టేశారు.
- పది రోజుల క్రితం హనుమకొండ జిల్లాకు చెందిన ప్రభుత్వ అధికారికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేసి మీపై ఈడీ కేసు నమోదైందని, దిల్లీలోని కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలని వాట్సాప్‌కు కొన్ని పత్రాలను పంపించారు. డబ్బులు ఇస్తే మాఫీ చేస్తానని చెప్పాడు. అనుమానం వచ్చిన ఉద్యోగి తన స్నేహితుడితో విషయం తెలిపాడు. పోలీసులతో నిర్ధారించుకొని నకిలీ అని తేలడంతో డబ్బులు పంపించకుండా జాగ్రత్తపడ్డాడు.

ఈ ఏడాది కేసులు ఇలా..

వరంగల్ కమిషనరేట్‌లో వీడియో కాల్ కేసులు : **41**

మొత్తం సైబర్ కేసులు **748**

ఉమ్మడి వరంగల్‌లో నమోదైన మొత్తం సైబర్ కేసులు **1215**

మోసపోతే ఫిర్యాదు చేయాల్సిన నెంబర్ **1930**

రవాణా మాటున చేతివాటం



ఆర్టీసీ లహరి ఏసీ బస్సు

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఆర్టీసీ సంస్థ నష్టాలను అధిగమించేందుకు కార్గో పార్శిల్, కొరియర్ రవాణా సేవలను అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యమైన ప్రయాణ ప్రాంగణాల్లో బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల ద్వారా బుకింగ్ అయిన సరకులను రవాణా చేస్తుంది. దీన్ని ఆసరా చేసుకొని కొందరు డ్రైవర్లు ఈ రవాణా మాటున చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఇటీవల ఓ తనిఖీలో తేలింది. గత నెల 26న బెంగళూరు నుంచి హనుమకొండకు వస్తున్న లహరి ఏసీ బస్సును హైదరాబాద్ వద్ద టీటీఐ అధికారులు తనిఖీ చేసారు. అందులో 16 మంది ప్రయాణికులు ఉన్నారు. వారితో పాటు ఏ ప్రయాణికుడికి సంబంధంలేని ప్లాస్టిక్ వస్తువులతో నింపిన ఆరు గన్నీ సంచుల మూటలు, వస్తువులతో కూడిన రెండు అట్టపెట్టెలు లభించాయి. అవి ఎక్కడివని డ్రైవర్లను ప్రశ్నించగా కార్గో ద్వారా బుకింగ్ అయి వస్తున్నాయని చెప్పారు. వాటికి సంబంధించిన రశీదు లేకపోవడంతో మూటలను స్వాధీనం చేసుకొని డ్రైవర్లపై కేసు నమోదు చేసి డిపోకు అప్పగించారు. వారికి విధులు అప్పగించకుండా విచారణ జరిపించాల్సిన డిపో అధికారులు మరుసటి రోజు నుంచే విధులు కేటాయించడం పలు విమర్శలు దారితీసింది. విలాసవంతమైన ఏసీ బస్సుల్లో సామర్థ్యానికి మించి సరకులు రవాణా చేస్తే ఆ బస్సులు మరమ్మతులకు గురవుతాయని నిపుణులు చెపుతున్నారు. కార్గో బుకింగ్ చేయని ఎలాంటి వస్తువులు, పార్శిల్ కవర్లు రవాణా చేయకూడదనే నిబంధన ఉంది. ఈ విషయమై సంబంధిత ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావును వివరణ కోరగా లహరి బస్సు డ్రైవర్లకు ఛార్జిషీట్ జారీ చేశామని, విచారణ జరుగుతోందని చెప్పారు. ఇది ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని, విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



పతకాలు సాధించిన 'లక్ష్య' అథ్లెట్లతో పారా ఒలింపియన్ జీవాంజి దీప్తి, కార్యదర్శి సారంగపాణి, నాగపురి రమేశ్

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం సహకారంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు మంగళవారం ముగిశాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగిన పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన అథ్లెట్లు అండర్-14, 16, 18, 20 విభాగాల్లో పోటీపడ్డారు. ముఖ్య అతిథిగా భారత అథ్లెటిక్స్ చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి హాజరై.. విజేతలకు పతకాలు అందించారు. ఈ సందర్భంగా నాగపురి రమేశ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి నిరంతర సాధన అవసరమన్నారు. పారా ఒలింపియన్ దీప్తిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో జరిగే టోర్నీల్లో రాణించాలని సూచించారు. ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడా కోటలో పోలీసు ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడ్డానన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి పోటీల వివరాలను వెల్లడించారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఏఎఫ్ఐ) టైమింగ్ ఆధారంగా జాతీయ స్థాయిలో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ఉంటుందని వివరించారు. హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అశోక్‌కుమార్, ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు గట్టు మహేశ్‌బాబు, పోటీల నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్‌లు, పీడీలు పాల్గొన్నారు.

రాణించిన 'లక్ష్య' అథ్లెట్లు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఈనాడు 'లక్ష్య' అథ్లెట్లు పతకాల పంట పండించారు. అండర్-20 విభాగంలో ఎండీ.కైఫ్ 100 మీటర్ల పరుగులో స్వర్ణం, 200 మీ. పరుగులో రజతం, తరుణ్‌కుమార్ జావెలిన్ త్రోలో రజతం, అండర్-18 విభాగంలో దత్తు లాంగ్ జంప్‌లో స్వర్ణం, హెప్టాథ్లన్‌లో స్వర్ణం, గణేష్ 100 మీ. పరుగులో స్వర్ణం, శ్రీధర్ 110 హర్డిల్స్‌లో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. పతకాలు సాధించిన 'లక్ష్య' అథ్లెట్లను నాగపురి రమేశ్, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి అభినందించారు.

మరో రికార్డే లక్ష్యంగా సాధన

పారిస్ పారా ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జీవాంజి దీప్తి చాలారోజుల తర్వాత వరంగల్ వచ్చింది. అథ్లెట్లు దీప్తిని ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా దీప్తి 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. 2025లో జరిగే వరల్డ్ అథ్లెటిక్స్, 2026లో ఏషియన్ గేమ్స్‌కు సన్నద్ధం అవుతున్నట్లు వివరించారు. ఈసారి నూతన వరల్డ్ రికార్డు నమోదు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. శారీరక, మానసిక లోపాలను వరంగా మార్చుకోవాలని నాగపురి రమేశ్ తెలిపారు. దీప్తి లోపమే ఆమెకు వరంగా మారిందన్నారు.

పసుపు వర్ణం సీతాకోకచిలుక



ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లిలో పసుపు వర్ణం సీతాకోకచిలుక దర్శనమిచ్చింది. సాధారణ సీతాకోకచిలుక కన్నా పెద్దదిగా ఉండటంతో పలువురు ఆసక్తిగా తిలకించారు. ఇది దశలిపట్టు కుటుంబానికి చెందినది.. శాస్త్రీయ నామం ఆంథెరియా పాఫియా.. సాధారణంగా మాత్ అని పిలుస్తారని కాకతీయ యూనివర్సిటీ వృక్ష శాస్త్ర ప్రొఫెసర్ వత్సవాయి సత్యనారాయణరాజు తెలిపారు.

– న్యూస్‌టుడే, వాజేడు(ములుగు జిల్లా)

జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు సన్వి



వరంగల్ క్రీడావిభాగం : రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో నగరానికి చెందిన బాలిక పతకాలతో రాణించింది. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు యాదాద్రి భువనగిరిలో రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. హనుమకొండ నయీంనగర్‌కు చెందిన అనిశెట్టి సన్వి మూడు విభాగాల్లో పతకాలు సాధించింది. అండర్-14లో 500 మీటర్ల విభాగంలో స్వర్ణం, 1000 మీటర్లలో రజతం, 5000 మీ. విభాగం ఎలిమినేషన్‌లో కాంస్య పతకాలతో అదరగొట్టింది. డిసెంబరు 5 నుంచి 15 వరకు మైసూర్‌లో జరిగే జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. సన్విని ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, కార్యదర్శి కైలాస్‌యాదవ్ అభినందించారు.

డ్యూటీ మీట్‌తో వృత్తి నైపుణ్యం పెరుగుతుంది



పోలీసు డ్యూటీ మీట్‌లో పాల్గొన్న అధికారులు, సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, న్యూస్‌టుడే: పోలీసుల డ్యూటీ మీట్‌తో వృత్తి నైపుణ్యం పెరుగుతుందని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గత మూడ్రోజులుగా భద్రాద్రి జోనల్‌లోని ఖమ్మం, కొత్తగూడెం, వరంగల్ కమిషనరేట్, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన పోలీసు అధికారులకు వరంగల్ కమిషనర్ కార్యాలయంలో జరుగుతున్న డ్యూటీ మీట్ మంగళవారంతో ముగిసింది. 18 విభాగాల్లో పోటీలను నిర్వహించారు. విజేతలకు పతకాలను అందించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన అధికారులను హైదరాబాద్‌లో జరిగే డ్యూటీ మీట్‌కు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకుంటే కేసుల దర్యాప్తులో నిందితులను సులువుగా పట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి పోలీసు అధికారికి విధి నిర్వహణలో డ్యూటీ మీట్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

అటవీ జంతువులను వేటాడిన ఆరుగురిపై కేసు



నిందితులతో ఎఫ్ఆర్వో శంకర్, సిబ్బంది

ములుగు టౌన్, న్యూస్‌టుడే: వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో శంకర్ తెలిపారు. ములుగు మండలం జాకారం చెరువు శివారు పంట పొలంలో అడవి పందులకు ఉచ్చులు అమర్చి హతమార్చినట్లు మంగళవారం ఉదయం తమకు సమాచారం అందిందన్నారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, జాకారానికి చెందిన ఒర్సు కొమురయ్య తన పంట పొలంలో అమర్చిన ఉచ్చులకు అడవి పంది, మనుపిల్లి చిక్కగా వాటిని కాల్చుతూ కనిపించగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. అడవి పంది పడిందని, తీసుకెళ్లి విక్రయించాలని కొమురయ్య ఇచ్చిన సమాచారం మేరకు వరంగల్ రంగశాయిపేటకు చెందిన ఒర్సు పరశురాం, ముదంగుల రాజు, ఆటకుంట సోమయ్య, ఒర్సు కొమురయ్య, ఒర్సు రాజు ఆటోలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వీరిని అదుపులోకి తీసుకుని ఆటోను సీజ్ చేయడంతోపాటు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో పేర్కొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224













ఉద్యోగాలతో పండగ సందడి

మరిపెడ, నర్సింహులపేట, కురవి, దంతాలపల్లి, గూడూరు, న్యూస్‌టుడే: డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారి ఇళ్లల్లో పండగ సందడి నెలకొంది. జిల్లా విద్యాశాఖ నుంచి ఉద్యోగం వచ్చిందంటూ వచ్చిన సందేశంతో ఎంపికైనవారి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. బుధవారం ప్రభుత్వం నియామక పత్రాలు ముఖ్యమంత్రి నుంచి తీసుకోనున్నారు. హైదరాబాద్ వెళ్లేందుకు ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు.

నర్సింహులపేట నుంచి తొమ్మిది మంది..


కుమారుడికి మిఠాయి తినిపిస్తున్న తల్లి, అన్న


తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్న తేజస్విని

నర్సింహులపేట నుంచి తొమ్మిది మందికి ఉద్యోగాలు లభించాయి. అందులో స్కూల్ అసిస్టెంట్‌గా సమ్మెట ప్రభాకర్, తెలుగు పండిట్‌గా యాకస్వామి, సమ్మెట కవిత, లింగాల మమత, పీఈటీగా సుంకరి రవి, ఎస్జీటీగా ఎర నాగి తేజస్విని, పోసారం వీరేందర్, బోగి వెంకటేశ్, బోగి యామిని ఉన్నారు.

రాంపురం నుంచి ఏడుగురు


చైతన్య, శ్రావణ్ దంపతులు

మరిపెడ మండలం రాంపురం గ్రామం నుంచి ఏడుగురు ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. నలుగురు మహిళలు, ముగ్గురు పురుషులున్నారు. వీరిలో కారింగుల చైతన్య, రాంపెల్లి శ్రావణ్ దంపతులతోపాటు మేకల సునీత, దుబ్బాకుల స్వప్న, ఈరగాని రంజిత్, బోర రోషన్నలు ఎస్జీటీలుగా ఉద్యోగం పొందారు. కృష్ణవేణి ఎస్ఏకు ఎంపికయ్యారు. కారింగుల చైతన్య ప్రస్తుతం రైల్వే కానిస్టేబుల్‌గా మహబూబాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు.

రామానుజాపురంలో అక్కాచెల్లెళ్లు


తల్లిదండ్రులతో ధర్మారపు మమత

దంతాలపల్లి: రామానుజాపురం గ్రామానికి చెందిన ధర్మారపు ఉప్పలయ్య, ధర్మారపు రాములు అన్నదమ్ములు. వారి కుమార్తెలు ధర్మారపు స్వాతి, ధర్మారపు మమత ఎస్జీటీ ఉద్యోగాలు పొందారు.


తల్లిదండ్రులతో ధర్మారపు స్వాతి

తొలి ప్రయత్నంలోనే రెండు ఉద్యోగాలు

కురవి మండలం తిరుమలాపురం గ్రామానికి చెందిన ఎండీ షాహిదాబేగం తొలి ప్రయత్నంలోనే రెండు ప్రభుత్వం ఉద్యోగాలు సాధించారు. కొన్ని నెలల కిందట టీజీటీ సాధించి ఉద్యోగం పొంది మహబూబాబాద్‌లోని గిరిజన గురుకులంలో హిందీ పండితురాలిగా పనిచేస్తున్న ఆమె ఎస్ఏ హిందీ సబ్జెక్టులో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకుతో ఉద్యోగం సాధించారు. ఆమెను తల్లిదండ్రులు ఎండీ.హనీఫ్, శమా ఆమెను అభినందించారు.


ఎండీ షాహిదాబేగం

సభ్యత్వ నమోదుకు అపూర్వ స్పందన



తొర్రూరు, న్యూస్‌టుడే: భాజపా ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామోహన్ రెడ్డి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని అమ్మాపురం క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం నిర్వహించిన భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్నిరంగాల్లో ముందుకెళ్తోందన్నారు. హరియాణాలో వెలువడిన అసెంబ్లీ ఫలితాలే ఇందుకు నిదర్శనమని చెప్పారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలపై ప్రజలు నమ్మకం కోల్పోయారని విమర్శించారు. సభ్యత్వ నమోదును మరింత వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీమాన్, కుమార్, రాములు, రాజేష్, యాకయ్య, రాంబాబు, నవీన్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీరెడ్డి కోలుకోవాలని ప్రత్యేక పూజలు

తొర్రూరు, న్యూస్‌టుడే: ఇటీవల ప్రమాదానికి గురై కాలుకి శస్త్రచికిత్స చేయించుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఝాన్సీరెడ్డి త్వరగా కోలుకోవాలని మండలంలోని వెంకటాపురంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద మంగళవారం పార్టీ మండల నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని కాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ మాజీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762,
మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14499
డోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

డోర్నకల్, న్యూస్‌టుడే: తోడేళ్లగూడెం ఎస్సీ కాలనీలో వీధి దీపం వెలగడం లేదు. - కుమార్

● మరమ్మతు చేయిస్తాం. - సాయితేజ, పంచాయతీ కార్యదర్శి, తోడేళ్లగూడెం

డోర్నకల్: లక్ష్మాతండాలో రోడ్డుకు ఇరువైపుల పేరుకుపోయిన పొదలతో అవస్థ పడుతున్నాం. - రాము

● శుభ్రం చేయిస్తాం. - ముస్తఫాబేగ్, ఎంపీవో

డోర్నకల్: శాంతినగర్‌లోని అంతర్గత వీధిలో మురుగుతో దుర్వాసన వస్తుంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి - సరిత

● కాలువ శుభ్రం చేయిస్తాం. - మోనికాజైన్, వార్డు కౌన్సిలరు, డోర్నకల్

కూలీ రేట్ల పెంపుపై చర్చలు వాయిదా

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న కూలీల రేట్ల పెంపు విషయంపై మంగళవారం మార్కెట్ ఛైర్మన్ గంట సంజీవరెడ్డి కార్మిక, రైతు నాయకులతో సమావేశం నిర్వహించారు. గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం నింపకాల సమయంలో కూలీలే బస్తా పట్టుకోవాలని రైతు నాయకులు డిమాండ్ చేశారు. కూలీలు వ్యతిరేకించడంతో చర్చలు సఫలం కాలేదు. ఈ నెల 15కు వాయిదా వేశారు.


దంతాలపల్లి పీహెచ్‌సీలో..


మరిపెడ ఆరోగ్య కేంద్రంలో

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...!

డోర్నకల్, మరిపెడ, దంతాలపల్లి: జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం వైద్యులు, సిబ్బంది బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఆరోగ్య కేంద్ర ఆవరణలో మహిళా వైద్య సిబ్బంది పూలతో బతుకమ్మలను తయారు చేసి సంప్రదాయ పాటలు పాడుతూ సంబురాలు నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఆసుపత్రి ఆవరణలో బతుకమ్మ పాటలు పాడుతూ కోలాటాలు వేశారు. అనంతరం బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు.


డోర్నకల్‌లో..

ఎంపికైన ఉపాధ్యాయులకు నేడు నియామకపు పత్రాలు

మానుకోట, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 నియామక ప్రక్రియలో తుది జాబితాలో ఎంపికైన జిల్లాలోని అభ్యర్థులను బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందజేసే కార్యక్రమానికి ఆర్టీసీ బస్సుల్లో తీసుకెళ్లనున్నట్లు డీఈఓ రాజేశ్వర్ తెలిపారు. అభ్యర్థులకు వ్యక్తిగతంగా చరవాణి ద్వారా సమాచారం ఇచ్చారు. 362 మంది అభ్యర్థుల్లో 280 మంది అభ్యర్థులు బస్సుల్లో రావడానికి అంగీకారం తెలిపారు. మిగతా 82 మంది కార్యక్రమానికి నేరుగా హాజరవుతామని పేర్కొన్నారు. కలెక్టరేట్ నుంచి బస్సులు బుధవారం ఉదయాన్నే బయలుదేరుతాయి. అభ్యర్థులందరికీ గుర్తింపు కార్డులను అందజేస్తారు. వివిధశాఖల సిబ్బంది ఇన్‌ఛార్జిగా ఉంటారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

డోర్నకల్, న్యూస్‌టుడే: తోడేళ్లగూడంలో ఒకరు మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... గ్రామానికి చెందిన ప్రసాద్(36) ఒక మిల్లులోని వాహనానికి డ్రైవర్‌గా పని చేస్తున్నారు. తాగుడికి బానిసగా మారారు. కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు చెప్పినా మారలేదు. ఎవరూ లేని సమయంలో ఇంట్లో సోమవారం ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. దీని గురించి మృతుడి భార్య అచ్చమ్మ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో శవపంచనామా జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేస్తేనే బిల్లులు


అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్‌కు వివరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి

నర్సింహులపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలోని పెండింగ్‌లో ఉన్న అమ్మ ఆదర్శ పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్‌టొప్పొ అన్నారు. మండలంలోని లోక్యాతండా గ్రామ శివారు మూడావత్‌తండాలోని ప్రాథమిక పాఠశాలలో, రూప్లాతండా గ్రామ శివారు ప్రాథమిక పాఠశాల లో జరిగిన అమ్మ ఆదర్శ పనులను ఆయన స్థానిక ఎంపీడీవో, ఎంపీవో, తహసీల్దారుతో కలిసి మంగళవారం ఆయన పనుల పురోగతిని తెలుసుకున్నారు.

అంకితభావంతో విధులను నిర్వహించాలి


ముల్కనూరు పీహెచ్‌సీలో బతుకమ్మ ఆడుతున్న డీఎంహెచ్‌వో మురళీధర్

గార్ల, న్యూస్‌టుడే: విధులను అంకితభావంతో నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీధర్ సూచించారు. ముల్కనూరు పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్రసవాల సంఖ్యను పెంచాలని తెలిపారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. నోడల్ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్‌జాదవ్, సీహెచ్‌వో సక్కుబాయి, డీపీవో రవీందర్, హెచ్‌ఈవో రామకృష్ణ, డీపీహెచ్‌ఎన్‌వో, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు, ఏఎన్ఎంలు ఉన్నారు.

మహిళల ఆర్థికాభ్యున్నతితో సమాజ ప్రగతి


అమ్మపాలెంలో మహిళకు ధ్రువీకరణపత్రం అందిస్తున్న నాగవాణి

డోర్నకల్, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబంలోనే కాదు సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని సీడబ్ల్యూసీ అధ్యక్షురాలు డా.నాగవాణి పేర్కొన్నారు. అమ్మపాలెంలో కాల్వరి పీస్ మినిస్ట్రీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో కుట్టులో శిక్షణ పొందిన మహిళలకు మంగళవారం ఆమె ధ్రువీకరణ పత్రాలు అందించారు. నాగవాణి మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదే క్రమంలో స్వచ్ఛంధ సంస్థల తోడ్పాటును స్వాగతించాలన్నారు. నాయబ్ తహసీల్దార్ వీరన్న, సంస్థ వ్యవస్థాపకుడు డేవిడ్, ఎస్‌బీఐ మేనేజర్ సుధాకర్‌రావు, ఛైల్డ్ ప్రొటెక్షన్ అధికారి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం


అపార్ట్‌మెంట్ నుంచి ఎగిసిపడుతున్న మంటలు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మహబూబాబాద్‌లోని కంకర బోడ్ ప్రాంతంలోగల ఎస్వీ టవర్స్ అపార్టుమెంట్‌లోని మూడోఅంతస్తులోని 303 గదిలో మంగళవారం ఏసీ విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కావడంతో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని తల్లాడ మోహన్‌రావుకు చెందిన అపార్టుమెంట్‌లో బ్యాంకు ఉద్యోగి బి.జీవిత అద్దెకు ఉంటున్నారు. ఉదయం ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంట్లో నుంచి పొగలు వస్తుండటంతో గమనించిన అపార్ట్‌మెంట్‌వాసులు అగ్నిమాప అధికారులకు సమాచారం చేరవేశారు. అగ్నిమాపక యంత్రంతో సిబ్బంది వచ్చినా గంటన్నరపాటు పని చేయకపోవడంతో మంటలు ఎగిసి పడ్డాయి. స్థానికులు బకెట్లతో నీళ్లు తెచ్చి అదుపులోకి తెచ్చారు. విలువైన దస్త్రాలతోపాటు సామగ్రి, బంగారు, వెండి ఆభరణాలు పూర్తిగా దగ్ధమైనట్లు బాధితురాలు తెలిపారు. ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ బాధితులను పరామర్శించారు. పట్టణ సీఐ పెండ్యాల దేవేందర్ వివరాలు తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు సీఐ తెలిపారు.

మొరాయించిన అగ్నిమాపక యంత్రం: స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక యంత్రం పని చేయలేదు. ఆలస్యం కావడంతో మంటలు ఎగిసి పడ్డాయి. మధ్యాహ్నం 12 గంటలకు ప్రమాదం జరగగా సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది 15 నిమిషాల్లో సంఘటనాస్థలికి చేరుకున్నారు. వాహనంలో నీళ్లు లేక పోవడంతోపాటు మోటార్లు పని చేయలేదు. దీంతో గంటన్నర పాటు ఆలస్యం జరిగింది. నెల్లికుదురు నుంచి తెప్పించిన అగ్నిమాపక యంత్రంలో మంటలను అదుపులోకి తెచ్చారు. జిల్లా కేంద్రంలో మరమ్మతుకు వచ్చిన అగ్నిమాపక యంత్రం ఉండటం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సహాయక చర్యలు తీసుకోవడంలో అగ్నిమాపక అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రమాద తీవ్రత పెరిగిందని తెలిపారు. అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేయడంపై ఉన్నతాధికారులు విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారధి, సీపీఐ నాయకులు అగ్నిమాపక వాహనం ముందు బైఠాయించి నిరసన తెలిపారు.

విలీనసభను జయప్రదం చేయాలి

బయ్యారం, న్యూస్‌టుడే: దేశంలోని 14 రాష్ట్రాల్లో సంఘటిత, అసంఘటిత కార్మికుల హక్కులకోసం పోరాడుతున్న ట్రేడ్ యూనియన్ సెంట్రల్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ)లో ఐఎఫ్‌టీయూ విలీనం అవుతున్న సందర్భంగా ఈనెల 20న నిర్వహించనున్న విలీనసభను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లాప్రధాన కార్యదర్శి బి.సూర్యం కోరారు. బయ్యారంలోని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ కార్యాలయం వద్ద విలీనసభ గోడపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాకయ్య, లచ్చయ్య, ధనంజయ, రమేష్, పూర్ణ, వెంకన్న పాల్గొన్నారు.

స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలి

దంతాలపల్లి, న్యూస్‌టుడే: ప్రజలు ఎల్ఆర్ఎస్‌ను వినియోగించుకుని తమ ఖాళీ స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని తొర్రూరు డీఎల్‌పీవో పుల్లారావు కోరారు. దంతాలపల్లిలో ఎల్ఆర్ఎస్‌లో దరఖాస్తు చేసుకున్న ఇళ్ల స్థలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇళ్ల ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణకు ఒక్క మండల కేంద్రంలోనే 1016 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి రథయాత్ర



ఇనుగుర్తి, న్యూస్‌టుడే: ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం గ్రామంలో మంగళవారం వైభవంగా వేంకటేశ్వరస్వామి రథయాత్ర నిర్వహించారు. వాహనాలను, ఎడ్లబండ్లను అందంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఏటా శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు గ్రామంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఉద్యమిస్తేనే సమస్యల పరిష్కారం

మహబూబాబాద్, న్యూస్‌టుడే: సమస్యలపై ఉద్యమిస్తేనే వాటికి పరిష్కారం లభిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య అన్నారు. మంగళవారం మహబూబాబాద్ పురపాలక సంఘం పరిధిలోని ఒకటో వార్డు ఈదులపూసల్లిలో నిర్వహించిన సీపీఎం వార్డు సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని భాజపా ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పిస్తామని మూడుసార్లు అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకటి, రెండు హామీలు తప్ప ఇతర హామీలను అమలు చేయలేదని వాటిని అమలు చేయాలని కోరారు. సమావేశం అనంతరం వార్డు శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. టి.విజయ్, హేమానాయక్, గొని వెంకన్న, రాజమౌళి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కొత్తగూడ, న్యూస్‌టుడే: కొత్తగూడ, గంగారం మండలాల్లోని ఎరువుల దుకాణాలను మంగళవారం ఏడీఏ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఎరువులకు సంబంధించిన నిల్వ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాలతోపాటు పొగుళ్లపల్లిలోని పీఏసీఎస్‌లో, పెద్దఎల్లాపురంలోని ఓడీసీఎంఎస్‌ను కూడా తనిఖీలు జరిపారు. తిమ్మాపురంలోని పంటక్షేత్రాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. ఏవో ఉదయ్, ఏఈవోలు ఉన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామానికి చెందిన షేక్ షాహీద్ జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభను కనబరిచి బంగారు పతకం సాధించినట్లు కోచ్ గంధసిరి యాకాంబ్రం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గేమ్స్ అండ్ యాక్టివిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధర్యంలో ఇటీవల దిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభను కనబరిచి బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. నవంబరులో నిర్వహించనున్న ఏసియన్ కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

మహబూబాబాద్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 74 మంది లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ మంగళవారం పంపిణీ చేశారు. క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రోగులకు మెరుగైన వైద్యం అందించే విధంగా కృషి చేస్తుందన్నారు. వివిధ మండలాలకు చెందిన మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు ఇవ్వాలని వినతి

నెల్లికుదురు, న్యూస్‌టుడే: పంచాయతీ కార్మికుల వేతనాలు ఇవ్వాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ మండల కార్యదర్శి బొల్లం ఎల్లయ్య కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ పండుగ పూట వేతనాలు చెల్లించకుండా పస్తులు ఉంచుతున్నారని ఆరోపించారు.

ఐద్వా మండల సభ

కేసముద్రం: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి గాడిపల్లి ప్రమీల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని హరిహర గార్డెన్స్‌లో మంగళవారం ఐద్వా మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు మహిళలపై హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐద్వా మండల అధ్యక్షులుగా పొన్నాల జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా సావిత్ర, కమిటీ సభ్యులుగా మేకల నాగమణి, మేకల లక్ష్మి, చిక్కుడు కవితలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం


1997-98 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులు

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997-98 విద్యా సంవత్సరం పదోతరగతి విద్యార్థులు మంగళవారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. పదోతరగతి మిత్రులంతా 131మందితో కలిసి 2006లో సంఘాన్ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రానికి చెందిన చిలువేరు సమ్మయ్యగౌడ్ స్నేహితులందరు కలిసి దిగిన ఫోటోలు మంగళవారం వారికి అందజేశారు. కార్యక్రమంలో శాగంటి రాములు, వెంకట్‌ఖన్నా, గొట్టం లక్ష్మణ్, గొట్టం సతీశ్, చందర్, పులిగిల్ల కిరణ్, అశోక్, యాకూబ్‌పాషా, బాలాజీ, కవిత, శారద, సునీత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు నిరసన

చిన్నగూడూరు: మహబూబాబాద్‌లో బుధవారం ఎమ్మార్పీఎస్ అధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు జి.స్వామి కోరారు. మంగళవారం చిన్నగూడూరులో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ లేకుండా ప్రభుత్వ నియామకాలు చేపట్టడం మాదిగ జాతిని మోసం చేయడమేనన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవిమాదిగ, శ్రావణమాదిగ, సురేష్ మాదిగ, నరేష్ మాదిగ తదితరులున్నారు.

సంక్షిప్తంగా

పది నెలల్లో పలు అభివృద్ధి పనులు

కురవి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేస్తుందని ఆ పార్టీ కురవి మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం అన్నారు. మంగళవారం కురవిలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సత్యవతి రాథోడ్ అభివృద్ధి చేయడం లేదని చెప్పడాన్ని ఆయన ఖండించారు. భారాస పదేళ్లలో అధికారంలో ఉండి చేయలేని పనులను పది నెలల్లోనే ఎమ్మెల్యే రామచంద్రునాయక్ చేశారన్నారు.

దాత సహకారంతో రహదారికి మరమ్మతు


పరిశీలిస్తున్న దాత వీరన్న, రైతులు

కురవి: గత నెలలో కురిసిన భారీ వర్షాలతో వరదల ధాటికి కురవి శివారు ముత్యాలకుంట వద్ద సిమెంటు, బీటీ రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లి నెల రోజులు గడిచినా పట్టించుకోలేదు. ఆ రోడ్డుపై నుంచి వ్యవసాయ పనుల కోసం రైతులు వెళ్లడం కష్టంగా మారింది. రైతులు పడుతున్న ఇబ్బందులను చూసిన అదే గ్రామానికి చెందిన బుక్య వీరన్న గమనించి మంగళవారం సొంత ఖర్చులు రూ.25 వేలు వెచ్చించి ట్రాక్టర్లతో మట్టి తెచ్చి పోసి రోడ్డుకు మరమ్మతులు చేశారు. రైతులకు ఇబ్బందులు తీరాయి.

మాజీ ఎమ్మెల్యే సంతాపం

గార్ల: భారాస పట్టణాధ్యక్షుడు గాజుల గణేష్ తండ్రి రాజన్న(68) అనారోగ్య కారణాలతో మంగళవారం మరణించారు. ఆయన భౌతిక కాయాన్ని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ హరిసింగ్ సందర్శించారు. తన ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని ఆ కుటుంబ సభ్యులకు తెలిపారు. భారాస మండలాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, మాజీ రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు రాధాకృష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యులు రమేష్, సురేష్, భారాస ఉపాధ్యక్షుడు బి.మురళి, తెజస రాష్ట్ర నాయకుడు జీఎంటీ రామారావు తదితరులు నివాళులర్పించారు.